ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 27 అక్టోబరు 2024 | 5



అతి వినియోగం ప్రమాదమే..



ప్రతి వస్తువులోను మంచిచెడులు ఉంటాయి. కేవలం మంచిని గ్రహించాలి. కత్తితో వైద్యుడు శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు నిలబెడతాడు. అదే కత్తితో చెడ్డవాడు ప్రాణాలు తీస్తాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిందే ఇంటర్నెట్.. దానిని స్మార్ట్‌ఫోన్‌లో పరిమితంగా వినియోగిస్తే జ్ఞానమే. ఎడిక్ట్ అయితే ప్రమాదమే. పిల్లలు దేనికి అలవాటు పడితే దానికి బానిసలవుతారు. ఆ పరిస్థితి రాకుండానే తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, మానసిక వైద్యనిపుణులు, రాజమండ్రి

30న 'దిశ' సమావేశం

అమలాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించనున్నట్టు కలెక్టర్, కమిటీ మెంబర్ సెక్రటరీ ఆర్.మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ కమిటీ అధ్యక్షుడు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల అభివృద్ధిపై కమిటీ సమావేశంలో సమీక్షిస్తారన్నారు. సమావేశానికి దిశ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో బిల్లుల వసూళ్ల కౌంటర్లు ఆదివారం సెలవు రోజున కూడా పనిచేస్తాయని సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజాబాబు తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు.

సస్యరక్షణ పద్ధతులను విధిగా పాటించాలి

అమలాపురం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వరి సాగులో సాగునీటి యాజమాన్యంతో పాటు సస్యరక్షణ పద్ధతులను రైతులు విధిగా పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు రైతులకు సూచించారు. సమనస రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ అధ్యక్షతన అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు వరి పంటలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి మనోహర్ యాంత్రిక పద్ధతులు, జీవ నియంత్రణ తదితర అంశాలను వివరించారు. ఐదేళ్ల నుంచి కొనసాగుతున్న ఉచిత పంటల బీమాలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసిందన్నారు. రబీ నుంచి రైతులు తమ వాటా ప్రీమియంను తామే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇప్పటి వరకు ఈ-క్రాప్‌లో నమోదైన రైతులంతా ఇన్సూరెన్సుకు అర్హులు కాగా ఇక బీమా పథకాల్లో చేరడానికి ఆప్షన్ ఉందన్నారు. వ్యవసాయాధికారులు కడలి ధర్మప్రసాద్, ఎన్‌వీవీ సత్యనారాయణ, వై.శోభ, జి.కుమార్‌బాబు పాల్గొన్నారు.

ఆదివారం ప్రత్యేకం

సెల్‌కలం!



పాప ఏడుస్తోంది.. ఉడ్‌వర్డ్స్ పట్టవే.. ఇదీ చాలా సుపరిచితమైన యాడ్.. ఇది ఒకప్పటి మాట.. మరిప్పుడు పాప ఏడుస్తోంది అంటే సెల్‌ఫోన్ ఇవ్వు ఊరుకుంటుందే అనే రోజులు వచ్చేశాయి.. పిల్లలు ఏడాది నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయిపోతున్నారు.. అదే మంచిదనుకుని.. చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి తమ పని తాము చేసుకుంటున్నారు.. సెల్ ఎందుకిచ్చావే అంటే ఫోన్ ఇస్తేనే కానీ ఊరుకోవడంలేదనేది పెద్దల మాట.

ఒక పిల్లాడు తీక్షణగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు.. సెల్ ఫోన్ పక్కన పెట్టేసి చదువుకోమని తల్లి చెబుతూనే ఉంది.. అయినా వినకపోవడంతో సెల్‌ఫోన్ లాక్కుని పుస్తకం చేతిలో పెట్టి చదువుకోమని చెబుతోంది. అనంతరం ఆమె టీవీ పెట్టుకుని చూస్తూ ఉంటుంది.. అప్పటికే సెల్‌ఫోన్ లాక్కుందని కోపంతో ఉన్న కుమారుడు.. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తల్లి తలపై మోదుతాడు.. ఇదీ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.. సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయితే ఎంత ప్రమాదమో చాటి చెప్పింది..

ఒక పెద్దావిడ సెల్‌ఫోన్ చూస్తూ ఇంట్లో వంట చేస్తోంది.. ఫోన్‌లో పడి వంట సంగతి మర్చిపోయింది.. కాసేపటికి కిచెన్ నుంచి పొగలు వస్తున్నాయి.. అయినా ఆమెకు వాసన తగల్లేదు.. ఇంతలో అదృష్టం కొద్దీ ఆమె భర్త ఇంటికి వచ్చాడు.. ఇంట్లో నుంచి వచ్చే పొగను చూసి కంగుతిన్నాడు.. వెంటనే ఏమేవ్ ఏం చేస్తున్నావ్.. ఇల్లు తగలబడిపోతుందే అంటూ పెద్దగా కేకలు వేశాడు.. తేరుకున్న ఆమె కిచెన్‌లోకి వెళ్లి చూసేసరికి వండిన కూర కాస్తా మాడిమసైపోయింది.. కాసేపు ఆగితే మంటలు చెలరేగి పెద్ద ప్రమాదమే జరిగేది.

ఆసుపత్రిలో ఉన్నా.. తల్లిదండ్రులతో షాపింగ్‌లో ఉన్నా.. బైక్‌పై వెళుతున్నా.. కారులో వెళుతున్నా.. ఇంట్లో ఉన్నా.. ప్రస్తుతం చిన్నారుల చేతిలో కనిపించేది ఒక్కటే.. అదే సెల్‌ఫోన్.. బడిలో తప్పించి ప్రతి చోటా చిన్నారుల ప్రపంచం సెల్ బందీగా మారిపోయింది.. అది లేనిదే అన్న ముట్టరు.. అది చూడనిదే స్నాక్స్ తినరు.. అందుకే నేటితరం చిన్నారుల్లో నూటికి 60 శాతం చిన్నారులు నాలుగు కళ్లతో దర్శనమిస్తున్నారు..

అరచేతిలో ఫోన్..కంట్లో నలుసు


- టచ్ చేస్తే బోలెడు వినోదం
- ఎడిక్ట్ అవుతున్న పిల్లలు..పెద్దలు
- సెల్‌ని వదల్లేకపోతున్న వైనం
- దంపతుల మధ్య దూరం
- అటకెక్కుతున్న చదువులు
- ఫోన్లకు బాల్యం బందీ
- మందగిస్తున్న కంటిచూపు

(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)

చందమామారావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. గోగిపూలుతేవే.. అంటూ చందమామను చూపిస్తూ తల్లులు వారి చంటిబిడ్డలకు గోరుముద్దలు తినిపించే రోజులు పోయాయి. ప్రస్తుత ఆధునికయుగంలో యాపిల్ రావే.. ఐఫోనురావే.. మా పిల్లవాడితో ఆడుకోవే.. గేమ్‌లతో రావే.. మా చంటిబిడ్డను అలరించవే అంటూ ప్రస్తుత యుగం తల్లిదండ్రులు చేస్తున్న చిన్నపాటి పొరపాటు భవిష్యత్తులో అది తీవ్రరూపం దాల్చి బాల్యం మంతా సెల్‌కు బానిసలుగా మార్చేసింది. తిండి లేకపోయినా ఉంటున్నారు కానీ పది నిమిషాలు సెల్ ఆగిపోతే ప్రాణం పోయినట్టు నేటి సమాజం తయారైంది. నేటి తరంలో ఏడాది చంటి బిడ్డ మొదలుకుని వృద్ధుల వరకు సెల్ బారిన పడనివారులేరంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండడంకోసం, ప్రపంచ జ్ఞానం కోసం రూపొందించిన అంతర్జాల చరవాణి ఇప్పుడు కొత్తపుంతలు తొక్కి మనిషి ఆరోగ్యానికి హానికరంగా మారిపోయింది. ఇందులో మంచిని గ్రహించి పరిమిత వినియోగం చేసేవారికంటే చెడును గ్రహించే వారే ఎక్కువయ్యారు. ముఖ్యంగా పిల్లలపై పెనుప్రభావానే చూపిస్తుంది.

తెల్లారింది మొదలు..

మనిషి ఉదయం లేచిన నాటి నుంచి రాత్రి నిద్రించే వరకు ఉన్న సమయంలో సెల్ ఫోనుదే ప్రథమస్థానం. మంచం పైనుంచి లేవగానే ఫోన్.. కాలకృత్యాలు తీర్చుకుంటూ ఫోన్.. బ్రేక్ ఫాస్ట్ చేస్తూ ఫోన్.. ఇలా చెప్పుకుంటూపోతే ఫోన్‌తోనే రోజంతా ఉంటారు.. అఖరికి రాత్రి పడుకునే ముందు అర్ధరాత్రి వరకు ఫోన్‌లోనే ఉంటున్నారు. అది చాలదన్నట్టు ఇంట్లో గృహిణిలకు అంటించారు. ఇప్పుడు వాళ్లు కూడా అనుక్షణం ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఇక పిల్లల విషయానికి వస్తే అన్నం తినను అన్నా.. మారం చేసినా ఫోన్ ఇచ్చి వారిని సముదాయిస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే గోలగోల చేసేవిధంగా కుటుంబమంతా ఎడిక్ట్ అయ్యింది.



చదువులపై పెనుప్రభావం

పిల్లలు అడిగారని తల్లిదండ్రులు ఆలోచించకుండా ఆండ్రాయిడ్ ఫోన్లను ఇస్తున్నారు. ఇదే ఇప్పుడు వీరి చదువుపై ప్రభావం చూపిస్తోంది. చదువుకునే సమయంలో ఫోన్ దగ్గర పెట్టుకుని చాటింగ్‌లు చేయడం, యూట్యూబులు చూడడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలు వెతుకులాట చేస్తూ చదువుపై ఏకాగ్రత సన్నగిల్లుతోంది. ఫలితంగా పిల్లలు చదువులో వెనుకబడుతున్నారు. నిజానికి కొన్ని స్కూల్స్, కళాశాలలో సెల్‌ఫోన్లను అనుమతించరు. ఎందుకంటే సెల్‌ఫోన్‌తో ఉంటే చదువు పాడైపోతుందని వారికి తెలుసు. కొన్ని కళాశాలల్లో మాత్రం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ తప్పనిసరి అంటున్నారు. అవసరం మేరకు వాడితే సెల్‌ఫోన్ విజ్ఞానాన్ని పంచుతుంది. పరిమితిమించి వాడితే వినాశానానికి దారితీస్తుంది. కాబట్టి సెల్‌ఫోన్ ఇవ్వడం తప్పుకాదుకానీ..అది అతిగా వినియోగిస్తేనే తప్పు. తల్లిదండ్రులు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

దంపతుల మధ్య దూరం..

ఒకనాడు కుటుంబ బాంధవ్యాలు ఉండేవి.. పెద్దలు వస్తే చాలా గౌరవంగా చూసేవారు. మరిప్పుడో పెద్దలు వచ్చినా ఎవరి పని వారిదే.. సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు.. వచ్చిన వాళ్లు వెళ్లిపోతుంటే ఊ అనే చిన్న సమాధానం తప్ప.. క్షేమసమాచారం మాటే మరిచారు. కుటుంబంలో నలుగురు ఉంటే నలుగురు తలో సెల్‌ఫోన్ పట్టుకుని నాలుగు గోడల మధ్య జీవిస్తున్నారంటే పరిస్థితి ఎంతగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరంలో ఇటీవల భార్యభర్తలు పార్కుకు వచ్చారు..ఒక మంచి ప్లేస్ చూసుకుని కూర్చున్నారు.. ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటారులే అని చూస్తుంటే అతను ఒక ఫోన్.. ఆమె ఒక ఫోన్ పట్టుకున్నారు.. వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకూ కీపాడ్‌పై పైకీ కిందకూ లాగుతూనే ఉన్నారు. చివరికి భార్య లేచి వెళ్లిపోదాం అనే సిగ్నల్ ఇవ్వడంతో భర్త ఫోన్ జేబులో పెట్టుకుని బయలుదేరాడు. అంతలా దంపతుల మధ్య సెల్ దూరిపోయింది. దూరం చేస్తుంది. అంతేకాదండోయ్ సోషల్ మీడియా వాట్సాప్.. ఫేస్‌బుక్.. ఇన్‌స్టా తదితర యాప్‌లతో అనుమానపు చిచ్చురేగుతోంది. కుటుంబాలు విడిపోతున్నాయి. సెల్‌కి ఎడిక్ట్ అయిన భార్యభర్తను పట్టించుకోవడంలేదంటే అతిశయోక్తి కాదేమో.

దెబ్బతింటున్న ఆరోగ్యం

ఆండ్రాయిడ్ ఫోన్‌లకు ఎడిక్ట్ అయినవారు ప్రస్తుతం అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చంటి బిడ్డకు చూపు మందగిస్తుంది. ఇంట్లో అదే పనిగా సెల్ చూస్తూ ఉండడం వల్ల కంట్లో రెటీనాపై ప్రభావం పడుతుంది. అందుకే పదేళ్లు దాటేసరికే చాలామందికి చూపు మందగిస్తోంది. స్కూల్‌కి వెళితే బ్లాక్ బోర్డు, డిజిటల్ బోర్డుపై అక్షరాలు కనిపించలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణంగా ఫోన్ నిలుస్తోంది. చీకటి గదిలో ఫోన్ చూడడం, ముఖానికి దగ్గరగా ఫోన్ పెట్టుకుని చూడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయి. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు సెల్‌ఫోన్‌లో గేమ్‌లు ఆడుతున్నా తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి మానసికస్థితిపై పడుతుంది. ఫ్రీఫైర్, హంటింగ్ తదితర గేమ్‌లు ఆడుతున్న బాలలు ఆ గేమ్‌లో ఉన్న వారిని అనుకరిస్తూ తమలో తామే మాట్లాడుకోవడం, ఆ గేమ్‌లో ఎటాక్‌లు జరిగినప్పుడు ఎదుర్కొనే దృశ్యాలు నిజజీవితంలో జరుగుతున్నట్టు ఫీలై ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. కొంతమంది పబ్‌జీకి ఎడిక్ట్ అయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోను నిద్రించే సమయంలో దిండు వద్ద పెట్టుకోవడం, పక్కన పెట్టుకోవడం వల్ల రేడియేషన్ కారణంగా ఇమ్యూనిటీ తగ్గించడంతోపాటు క్యాన్సర్ కణాలు పెరిగే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు ఆండ్రాయిడ్ ఫోన్లను దూరంగా ఉంచడమే ఉత్తమం.


కనుల పండువగా..

కొనసాగుతున్న వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న భక్తజనం





స్వామివారికి శ్రీపుష్పోత్సవం



ఊయల సేవ నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి..ఆరో రోజు స్వామివారికి వివిధ విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారు సూర్యప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాలతో పాటు శనివారం పర్వదినం కావడంతో వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వార్త.. 6లో





అట్టహాసంగా ప్రారంభం

అప్పనపల్లి బాలబాలాజీ పుణ్యక్షేత్రంలో ఘనంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు
తొలిరోజు విశేష పూజా కార్యక్రమాలు 6లో
విద్యుత్ దీపాలతో కళకళ

మాకు ఓటు హక్కు లేదా?

మేము గ్రాడ్యుయేట్లు కాదా?
ఎమ్మెల్సీ ఓటు నమోదుకు వెళితే తిరస్కరిస్తున్నారు..
కలెక్టర్ చొరవ తీసుకుని స్పష్టత ఇవ్వాలి
ఓపెన్ డిగ్రీ పట్టభద్రుల వేడుకోలు

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదులో ఓపెన్ డిగ్రీ సర్టిఫికెట్ చెల్లదని అధికారులు పేర్కొనడంపై ఓటు నమోదు చేసుకునేవారు తీవ్ర అసంతృప్తి, నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఓటు నమోదకు సంబంధించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, ఓటరు ఐడీకార్డు, అటస్టేషన్ జిరాక్సు కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజు జత చేయాల్సి ఉంది. అయితే ఎమ్మెల్సీ ఓటు నమోదుకు సంబంధించి నవంబరు 6వ చివరి తేదీ. అయితే ఓపెన్ విద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చేసిన వారి దరఖాస్తులు తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వ అండర్ టేకింగ్ పొందిన యూనివర్సిటీ సర్టిఫికెట్లు మాత్రమే ఎమ్మెల్సీ ఓటుకు అర్హత కలిగినవని, ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ఉన్నవారు అర్హులు కాదని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఓటు నమోదుకు వెళ్లేవారిని తిరస్కరించడంతో వారు సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్నారు. ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్ చెల్లుబాటు కానప్పుడు ఓపెన్ విద్యా విధానంలో చదివి ఉపయోగం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

పోలీసు విధులు, ఆయుధాలపై అవగాహన కల్పించేందుకు

ఓపెన్ హౌస్

అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్



ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీసు విధులపై విద్యార్థులతో పాటు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే లక్ష్యంతో పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అమలాపురంలోని జిల్లా ఆర్మ్ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ హౌస్ ద్వారా పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు వాటి ఉపయోగాలను వివరిస్తామన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు చేపట్టే కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులకు తుపాకులు, ఫింగర్ ప్రింట్స్, క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై పోలీసు అధికారులే నేరుగా వివరించారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పోలీసు ఓపెన్ హౌస్‌ను తిలకించారు. కార్యక్రమంలో డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్, సీఐలు పి.వీరబాబు, రాజశేఖర్, వి.శ్రీనివాస్, పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం పరిధిలో పశుగణన

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘ పరిధిలో పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లకోసారి పశుగణన జరుగుతుందన్నారు. 2019లో జరిపిన పశుగణన లెక్కల ప్రకారం పురపాలక సంఘ పరిధిలో 865 ఆవులు, 918 గేదెలు, 320 గొర్రెలు, 120 పందులు ఉన్నాయన్నారు. పశుగణను పక్కాగా చేయడం వల్ల వాటికి ఎన్ని టీకాలు అవసరమో లెక్క తేలుతుందన్నారు. పట్టణంలోని వీధి కుక్కలను సైతం లెక్కించనున్నట్లు చెప్పారు. వాటి సంతానోత్పత్తి పెరుగుదల కాకుండా తగు చర్యలు తీసుకోనున్నామని డాక్టర్ విజయారెడ్డి తెలిపారు.

ఐషర్ వ్యాన్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి 7లో

సండే స్పెషల్

కొబ్బరన్నం కాంబినేషన్..

ఇప్పుడు ఇదే ట్రెండింగ్.. మెనూలో కొబ్బరి అన్నంతో వెజ్, నాన్‌వెజ్ వంటకాలు



కాస్త జిహ్వా చాపల్యం ఉన్న వాళ్లకు వెజ్ అయినా, నాన్‌వెజ్ అయినా బిర్యానీ మాట వినబడగానే నోరు జివ్వున లాగుతుంది. కానీ మసాలాలు, పొడులు, నూనె వగైరా చాలామంది ఉదరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఇక నాణ్యత లేని సరుకులతో చేస్తే అనారోగ్యమే. బిర్యానీ కంటే సులభంగా తయారయ్యే ఆరోగ్యమైన వంటకం ఈమధ్య ట్రెండింగ్‌లోకి వచ్చింది. అదే కొబ్బరన్నం. మన పూర్వీకులు వండి వార్చిన వంటకమే. కాకపోతే ఇవాళ రెస్టారెంట్లలో ఈ డిష్‌కి విపరీతమైన ఆదరణ పెరిగింది. మసాలా పొడులు, ఎసెన్సులు వంటివి లేకుండానే.. వంటనూనె వాడకుండానే తయారైపోతుంది. పైగా కొబ్బరి పాలతో చేసే ఈ అన్నం ఆరోగ్యానికీ మేలు. దీంతో ఈమధ్య కొబ్బరి అన్నం (కోకోనట్ రైస్) మెనూలో చేరిపోయింది. నిజానికి మన ఇంట్లో ఇప్పటికీ పిల్లలకు లంచ్ బాక్స్‌లోకి తరచూ రెడీ చేసే రెసిపీ కూడా ఇదే. కొబ్బరన్నం వెజ్‌తోను, నాన్ వెజ్ అయితే కోడికూరతో కలిసి వేడివేడిగా లాగించేస్తే అబ్బో దాని రుచే వేరు.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్)

ఈరోజు ఆదివారంకదా.. ఏమిటి స్పెషల్ అనుకోని వారుండరు. అటు వెజ్, ఇటు నాన్‌వెజ్ ప్రియులు ఏదొక ప్రత్యేక వంటకం కోసం ఎదురు చూస్తారు. ఇంట్లో కాకుండా బయటకు వెళితే కచ్చితంగా బిర్యానీ మెనూలో ఆర్డర్ చేస్తారు. ఇది కూడా వెజ్, నాన్‌వెజ్‌లో ఓ డజను రకాలు. కానీ మషాల్సాలు, రకరకాల పొడుల ఘాటు కొందరిని ఇబ్బందిపెడుతుంది. ఈనేపథ్యంలో కొబ్బరన్నం కాంబినేషన్‌లో అనేక వంటకాలను ఈమధ్య రెస్టారెంట్లు తమ మెనూ కార్డులో చేర్చాయి. పేరున్న హోటళ్ల నుంచి చిన్న చిన్న కర్రీ పాయింట్ల వరకు కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలను అందిస్తున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర నగరాల్లో అయితే కొబ్బరన్నంతో కలిపిన వంటకాలను మాత్రమే విక్రయించే ప్రత్యేక కిచెన్ పాయింట్లూ వెలిశాయి. మరికొందరు సేంద్రియ ఉత్పత్తులతో కూడిన కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలు తమ స్పెషల్ అని ప్రకటించుకుంటున్నాయి. ఎందుకింత క్రేజ్ పెరిగిందో తెలియదు గాని వీటికి ఆర్డర్లూ బాగా పెరిగాయి. నిజానికి కొబ్బరన్నం మనకు కొత్తేమీ కాదు. పూర్వీకుల నుంచి ఉన్న వంటకమే. ఇప్పటికీ వంటిళ్లలో పిల్లల కోసం అప్పుడప్పుడూ స్పెషల్ రెసిపీ అంటూ తల్లులు చేస్తూనే ఉంటారు. దీన్ని మార్కెట్ పట్టుకుంది. నూనెలు, పెద్దగా మషాలాలు లేకుండా స్పెషల్ ఫుడ్ కావాలనుకునే వారి కోసం కోకోనట్ రైస్‌తో కూడిన వంటకాలను అందిస్తున్నారు. మీరూ ఓసారి చూసేయండి మరి.

ఇలా వండేద్దాం..

రెండు కప్పులు (సుమారు పావుకిలో) బియ్యానికి సరిపడా ఏమి కావాలో చూద్దాం. ముందుగా కొబ్బరి పాలను సిద్ధం చేసుకోవాలి. అప్పటికప్పుడు చేస్తేనే రుచి తగ్గకుండా ఉంటుంది. మరీ లేత, మరీ ముదురుకాకుండా మధ్యస్తంగా ఉండే ఒక మీడియం సైజు కొబ్బరికాయను తీసుకోండి. దానిని బద్దలుకొట్టి నీటిని తీసేయండి. కొబ్బరిని వేరుచేసి చిన్న ముక్కలుగా కోసి మిక్సీలో వేసి ఓ గ్లాసు నీళ్ల వెయ్యండి. మిక్సీ చేసి జ్యూస్ జల్లెడ, టీ వడకట్టు, శుభ్రమైన క్లాత్‌లో పోసి పాలను వడకట్టుకోవాలి. ఓ రెండు సార్లు ఇలా చెయ్యవచ్చు. పాలు మరీ చిక్కగా ఉంటే అన్నం వెగటు వస్తుంది. మరీ పల్చగా ఉంటే రుచి తగ్గిపోతుంది. అందువల్ల మధ్యస్తంగా ఉండేలా పాలను తీసుకొని పక్కన పెట్టుకోండి. వండటానికి ఎలక్ట్రికల్ లేదా మామూలు కుక్కర్ అయితే బాగుంటుంది. బియ్యాన్ని శుభ్రంగా కడిగిన తర్వాత దానిలో ఒకటికి రెండు లెక్కన ముందుగా రెడీ చేసుకున్న పాలు వేయాలి. మూడొంతుల పాలు ఒక వంతు నీళ్ల ఉన్నా పర్వాలేదు. మధ్యకు చీరిన మూడు పచ్చిమిర్చి, సరిపడా ఉప్పు, చిన్న దాల్చిన చెక్క, నాలుగు చొప్పున యాలికలు, లవంగాలు, పలావు ఆకులు, మరాఠి మొగ్గలు, స్టార్ పువ్వు ఒకటి, కొత్తిమీర, ఒకవేళ ఉంటే చాలా తక్కువగా పుదీనా ఆకులు, జాజికాయ, జాపత్రి, జీలకర్ర, షాజీరా వేసుకోవాలి. పసుపు (రంగుకోసం), మిరియాలు, కరివేపాకు, జీలకర్ర, పెరసపప్పు, జీడిపప్పు, తరిగిన అల్లం వంటివి మీ ఇష్టం. అల్లం, వెల్లుల్లి పేస్టు, వంటనూనె, మషాలా తదితర పొడులు అవసరం లేదు. ఇప్పుడు కుక్కర్ మూత పెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ఆవిరి తగ్గిన తర్వాత మూత తీసి చూస్తే నోరూరించే.. ఆరోగ్యకరమైన వేడి వేడి కొబ్బరి అన్నం సిద్ధం. మాంసాహారులైతే కోడికూర (గ్రేవీగా) తప్పనిసరిగా ఉండాల్సిందే. శాకాహారులైతే బంగాళా దుంప, మష్‌రూమ్, పన్నీరు, జీడిపప్పు ఇలా ఇష్టమైన కాంబినేషన్‌తో లాగించేయవచ్చు. రైతా(ఉల్లి చెట్నీ) మీ ఇష్టం.

● ఆరోగ్య విలువలు ఇవీ..



కొబ్బరి పాలు సహజ మాయిశ్చరైజర్‌గా పని చేస్తాయి. కొబ్బరి పాలలో విటమిన్ ఏ,బీ,సీ, కాల్షియం, పొ స్ఫరస్, ఐరన్, సహజ పిండి పదార్థాలు, ప్రొటీన్స్ పుష్కలంగా లభిస్తాయి. కొబ్బరిలో ఉండే సైటోకైనిన్స్ చర్మంలోని వృద్ధాప్యపు ఛాయలను నెమ్మదించేలా చేస్తాయి. కొబ్బరిలోని ఎంజైములు ఉదరంలోని యాసిడ్ రిఫ్లెక్స్‌ని అరికడతాయి. కొబ్బరి పాలు జీవక్రియలను పెంపొందిస్తాయి. బరువును తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్, జుట్టు వృద్ధి, చర్మానికి నిగారింపు వస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. 100 గ్రాముల కొబ్బరిపాలలో 230 కిలోల క్యాలరీల శక్తి, 2గ్రా. డైటరీ ఫైబర్, 23.8గ్రా. కొవ్వులు, 3.3గ్రా. చక్కెర, 3గ్రా. ప్రొటీన్లు, 5గ్రా. కార్బొహైడ్రేడ్స్, 15గ్రా.కాల్షియం, 3గ్రా.విటమిన్ సి, 0.7మి.గ్రా జింక్, 100మి.గ్రా భాస్వరం, 37 మి.గ్రా మాంగనీస్, 37మి.గ్రా మెగ్నీ షియం, 2 మి.గ్రా ఇనుము, 265మి.గ్రా పొటాషియం ఉంటాయి.





ఆరోగ్యకరమైన ఆహారం కోరుకునే వారికి కొబ్బరన్నం ఇప్పుడు స్పెషల్ రెసిపీ. ఇందులో పెద్దగా మసాలాలు, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వాడం. తాజా కొబ్బరి పాలు, సోనామసూరీ బియ్యంతోపాటు యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, అనాస పువ్వు వంటివి మాత్రమే వాడతారు. ఇది ఆరోగ్యం. తేలికగా జీర్ణం అవుతుంది. కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలను మాత్రమే విక్రయిస్తాం.

- టి.చరణ్, ఉగ్గు ఫుడ్స్, వలసపాకల, కాకినాడ

కవిత్వమై.. పుట్టింది!

- 'కవిసంధ్య' 50 సంచికల విజయయాత్ర
- నేడు యానాంలో స్వర్ణోత్సవ సభ
- 13 మందికి ప్రతిభా పురస్కారాలు





పత్రిక నిర్వహణ కష్టమైన పని. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. అందులోనూ కేవలం కవిత్వం మీదనే ఒక పత్రిక నడపడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు.. ఈ బాధ్యతను ప్రముఖకవి శిఖామణి ఎప్పుడో భుజానకెత్తుకున్నారు. యానాం కేంద్రంగా కవిత్వమే ప్రధానంగా 'కవిసంధ్య' ఆరంభమైంది. ఎనిమిదేళ్ల కిందట మొదలైన ఈ ప్రయాణం తాజాగా స్వర్ణోత్సవ సంచికను తీసుకువచ్చింది. ఈ సందర్భంతోపాటు ఏటా కవిసంధ్య పేరిట జరిగే పురస్కారాల వేడుకను కూడా ఈనెల 27 ఆదివారం ఉదయం తొమ్మిదిన్నరకు యానాంలోని గీతాభవన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, అనంతరం వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాలను ప్రదానం చేస్తారు. అలాగే శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవిసమ్మేళన కార్యక్రమాలు జరుగున్నాయి. అదేవిధంగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను మరో 13 మందికి అందజేయనున్నారు. కవిసంధ్య సంపాదకుడు, కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అతిథులుగా సాహితీవేత్తలు డాక్టర్ దీర్ఘాశి విజయ్ భాస్కర్, డా.సి.మృణాళిని, డా.వీరలక్ష్మీదేవి, డా.ఆర్.సీతారాం, డా.వరుగు భాస్కర్‌రెడ్డి, దాట్ల దేవదానంరాజు హాజరవుతారు.

శిఖామణి ఏమంటున్నారంటే..



నాడు 16 పేజీలతో తొలి అడుగు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయిన తర్వాత 2015లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉద్యోగ విరమణ పొందాను. అప్పటికే రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో కవిసంధ్య సాహిత్య కార్యక్రమాలను నిర్వహించింది. రాష్ట్ర విభజన తర్వాత కవిసంధ్య కార్యక్షేత్రాన్ని నా స్వగ్రామం కేంద్రపాలిత ప్రాంతమైన యానాం మార్చాను. యానాంలో 2016 ఏప్రిల్ 8న ఉగాది వేడుకలకు కవిసంధ్య కవిత్వ పత్రికగా వెలువడింది. ఏప్రిల్-మే ద్వైమాసిక సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖచిత్రంలో 16 పేజీల సంచికగా వెలువడింది. ఇప్పుడు స్వర్ణోత్సవ సంచిక 136 పేజీలతో వెలువడుతోంది.

కవిత్వానికి పత్రిక కావాలి

ఒకప్పుడు తెలుగులో కథకు, నవలలకు ప్రత్యేక పత్రికలుండేవి. ఆంధ్రజ్యోతి వీక్లీలో ఈవారం కవిత పేరుతో ఒక పేజీ కేటాయించేవారు. సండే మ్యాగజైన్లో కూడా కవిత్వానికి ఒక పేజీ ఉండేది. ప్రస్తుతం నేను ప్రముఖ కవులు, రచయితల సంతకాలు సేకరించి కవిత్వ పేజీ అవసరాన్ని గుర్తుచేస్తున్నాను. కవిత్వానికి స్థల నిర్దేశం చేయడం పోలీసింగ్ లాంటిది. కవిత్వానికి పోలీసింగ్ మంచిదికాదు. గతంలో కంజిర, సంతకాలు, జముకు, చైతన్య కవిత వంటి పత్రికలు వచ్చి ఆగిపోయాయి. కవిత్వానికి ఒక పత్రిక అవసరం.

ప్రయత్నం... ప్రయాస కాదు..

కవిసంధ్య సన్నాహక సభలో మిత్రులు అన్నట్టు రచనలు వచ్చినంతగా చందాలు రావన్నది అనుభవం మీద తెలిసింది. తొలి సంవత్సరంలో సాహితీ మిత్రులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. తర్వాత రచనలు అడిగినంత చనువుగా చందాలు, రెన్యూవల్స్ అడగలేకపోయాం. కవిసంధ్య తయారీ హైదరాబాద్‌లో.. ప్రింటింగ్ విజయవాడలో.. పోస్టింగ్ యానాంలో.. ఒక అరడజను మిత్రులతో కలిసి యానాం కవిసంధ్య ఆఫీసులో కూర్చుని పత్రికలకు పోస్టింగ్‌కు సిద్ధం చేసేవాళ్లం. ఇప్పటికీ ఇదే కార్యక్రమం. అయినప్పటికీ ఇది ఆనందమేకానీ ప్రయాసకాదు.

జ్ఞాపకాలు, సన్నివేశాలు...

పత్రిక ప్రారంభించాక కొత్తలో ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి పది వేల చెక్కును పంపించారు. అది కవిసంధ్య పేరు మీద ఉంది. అప్పటికి కవిసంధ్యకు ఇంకా బ్యాంకు అకౌంట్ తెరవలేదు. అదే విషయం ఆమెకు చెబితే నా పేరున మరో చెక్కు పంపారు. కవిసంధ్య పేరున ఉన్న చెక్కును తిరిగి పంపుతుంటే వద్దు అకౌంట్ తెరిచాక అది కూడా బ్యాంకులో వేసుకోండి అన్నారామె. పేరు చెప్పడానికి ఇష్టపడని అజ్ఞాత సౌజన్యమూర్తులూ కొందరు కవిసంధ్యకు అండగా ఉన్నారు. నాకు కవిగా పదుల సంఖ్యలో చిన్నా పెద్దా పురస్కారాలు వచ్చాయి. అయితే ప్రముఖ పద్యకవి అనుమాండ్ల భూమయ్య ఇటీవల పద్యకవి సత్కార సభలో కవిసంధ్య పత్రిక సంపాదకుడిగా నన్ను పిలిచి సత్కరించడం కవిసంధ్యకు, సంపాదకుడిగా నాకు దక్కిన తొలి సత్కారం ఇది.

ఇక భవిష్యత్తు ఆలోచన...

కవిసంధ్య 50 సంచికలను మనసు ఫౌండేషన్ రాయుడు సౌజన్యంతో డిజిటలైజేషన్ చేసి భవిష్యత్తరాలకోసం భద్రపరచాలనే ఆలోచనగా ఉంది. వచన కవిత్వం వందేళ్ల పూర్తి చేసుకోబోతున్న తరుణంలో వందేళ్ల వచన కవిత పేరుతో ఒక సంకలనం తెచ్చే యోచన ఉంది. - ఆంధ్రజ్యోతి/యానాం





సభలో మాట్లాడుతున్న చందు సుబ్బారావు, మృణాళిని

సోమసుందర్ సాహిత్యం.. నేటి తరానికి తెలియజేయాలి

ఆవంత్స శత జయంతి సభలో సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని

పోర్టుసిటీ (కాకినాడ), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వజ్రాయుధకవి ఆవంత్స సోమసుందర్ సాహిత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందని ప్రముఖ రచయిత్రి, సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ) తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని అన్నారు. కాకినాడ గాంధీ భవన్‌లో సోమసుందర్ శత జయంతి సభను సాహిత్య అకాడమి, క్రియా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో మృణాళిని మాట్లాడుతూ సోమసుందర్ 100కుపైగా పుస్తకాలు రాశారన్నారు. ప్రముఖ సాహితీవేత్త చందు సుబ్బారావు మాట్లాడుతూ సోమసుందర్ ఆత్మకథలో ఆయన జీవితంలో జరిగిన సంఘటనలన్నీ ఉన్నాయన్నారు. జీవితచరిత్ర అంటే ప్రతి సంఘటన ఉండాలని ఆయన కోరుకు నేవారని, ఆయనతో అప్పట్లో సన్నిహితంగా మెలిగిన స్నేహితురాలి గురించీ జీవిత చరిత్రలో రాయడం ఆయనకే చెల్లిందన్నారు. డాక్టర్ జి.సీతారామస్వామి మాట్లాడుతూ సోమసుందర్ పేదల వైపు నిలబడి అభ్యుదయకవిగా పేరు తెచ్చుకున్నారన్నారు. సదస్సులో క్రియా సొసైటీ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, సాహితీవేత్తలు నందిని సిధారెడ్డి, ఎన్.ఈశ్వరరెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీర లక్ష్మీదేవి, కస్తూరి నాగమురళీశంకర్, నండూరి రాజగోపాల్, ఆర్.సీతారామారావు, మేకా మన్మథరావు, శిఖామణి, మేకా మన్మధరావులు పాల్గొన్నారు.





సర్వాంగ సుందరంగా అలంకరించిన బాలబాలాజీ ఆలయం. పక్క చిత్రంలో పవిత్రోత్సవాలకు స్వామివార్లను తీసుకుని వస్తున్న అర్చకులు

వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

ఆధ్యాత్మికతతో కళకళ్లాడిన అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం



స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి పవిత్రోత్సవాలు పంచారాత్ర ఆగమానుసారం త్రయాహ్నిక దీక్షతో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో విశ్వక్సేనారాధనతో ఈ పవిత్రోత్సవాలు వేద మంత్రోచ్చరణల మధ్య ప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, పరిషత్ దక్షిణ రుత్విక్ వరుణ, రక్షాబంధన పూజ, అంకురార్పణాంగ వాహనం, చతుస్థానార్చనలు, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్ర ఆదివాసం, శ్రీవారికి నవకలశ స్నపన నివేదన, మంగళ శాసనం తదితర పూజలను అర్చకులు జరిపారు. ఈ పవిత్రోత్సవాల వల్ల స్వామివారిలో తేజస్సు కలుగుతుందన్నారు. దోషాలు పరిహారం అవుతాయని, శ్రీవారి కటాక్షంతో లోకశాంతి, విశ్వశాంతి కలుగుతుందని అర్చకులు ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవస్థానంలో సుప్రభాత సేవ..

బాలబాలాజీ దేవస్థానంలో ప్రతి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. శనివారం స్వామివారి మేలుకొలుపు అనంతరం తొలిహారతిని ఘనంగా జరిపారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. ప్రతి శనివారం జరిగే తొలిహారతిలో భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ ఏసీ కోరారు.

వ్యవసాయాధికారులుగా పదోన్నతులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 26: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు వ్యవసాయ విస్తరణాధికారులకు మండల వ్యవసాయాధికారులుగా పదోన్నతి ఇస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు. సీతానగరం మండలంలో పనిచేస్తున్న పీవీ శ్రీనివాస్‌ను పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా, ఆలమూరు మండలంలో పనిచేస్తున్న కిషోర్‌బాబుకు తాడేపల్లిగూడెం పురుగు మందుల ప్రయోగశాలకు, కపిలేశ్వరపురం మండలంలో పనిచేస్తున్న ఐ. లక్ష్మిని కాకినాడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా నియమించారు. శనివారం వారు బాధ్యతలు స్వీకరించారు.

పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన జీవనోపాధులు

మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్



మాట్లాడుతున్న తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన జీవనోపాదుల ఏర్పాటు చేయాలని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. సమీక్షలో మెప్మా పీడీ బి.ప్రియంవద, కమిషన్లు, మెప్మా సిబ్బంది, బీటీఈలు, సీఎంఎం, టీఎంసీ, సీవో, డీఈవోలు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీవారి శ్రీపుష్పోత్సవం

- శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనసేవ
- ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ సేవ
- మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనసేవ
- ఆరోరోజు బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద మంత్రాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు విద్యుత్, పుష్పాలంకరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఆరోరోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వసంత మండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించగా ఉత్సవమూర్తులు కొలువుదీరి పూజలందుకున్నారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్తకలశారాధన, మహస్నహనపనము, ప్రధాన హోమాలు నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు చేతులు మీదుగా మహా పుష్పయాగం జరిపారు. భక్తులు పుష్పయాగం తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనసేవలో విహరించారు. రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు దీపాలంకరణ సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు. రాత్రి మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రవాహన వాహనంలో ఆశీనులయ్యారు. మిరుగొట్టు గొలిపే బాణసంచా కాల్పులు, విద్యుత్ వెలుగులు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారు చంద్రప్రభ వాహనంలో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారులు భక్తులను రంజింప చేశాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామివారికి హోమములు, లోకకళ్యాణార్థం శ్రీ శ్రీనివాస కళ్యాణం, రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు గజవాహనసేవ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శన చేయనున్నారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న పండితులు



స్వామివారి శ్రీ పుష్పోత్సవం జరుపుతున్న వేద పండితులు



బ్రహ్మోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న దృశ్యం



సూర్యప్రభ వాహనసేవలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న నాగమణి

సత్యదేవ నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం

అన్నవరం, అక్టోబరు 26: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకం, గోసంరక్షణ ట్రస్టుకు శనివారం కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన బోసు నాగమణి రూ.2 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో విభాగ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు అందజేశారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.



పాపికొండలు వెళ్లొద్దాం...

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల తర్వాత పాపికొండలు విహార యాత్ర శనివారం ప్రారంభమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని పోశమ్మగండి వద్ద ఉన్న బోటు పాయింట్ నుంచి కావేరి బోటులో సుమారు 40 మంది పర్యాటకులు వెళ్లారు. ఈ బోటును దేవీపట్నం ఎస్ఐ షరీఫ్, తహసీల్దారు రామకృష్ణ పరిశీలించారు.

విచారణ పక్కదారి!

టేకు చెట్లు మాయం వ్యవహారంలో ఫారెస్టు అధికారులను రక్షించేందుకు రంగం సిద్ధం.... ఇందుకూరు అటవీ రేంజ్‌లో బాగోతం

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టేకు చెట్లు మాయం కేసులో విచారణ సక్రమంగా జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండల పరిధిలోకి వచ్చే ఇందుకూరు అటవీ రేంజ్‌లో రమణయ్యపేట వద్ద 69 టేకు చెట్లను దొంగలు రాత్రికి రాత్రే తరలించుకుపోయారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.60లక్షలకు పైగా ఉంటుందని ఒక అంచనా. సెప్టెంబరు 28న టేకు చెట్లు మాయమయ్యాయి. టేకు చెట్లను ఎవరు నరికించారు... ఎక్కడికి తరలించారు... ఇందులో అధికారుల పాత్ర ఉందా లేదా అనే కోణంలో విచారణ జరగాల్సి ఉంది. కానీ అధికారులు అసలు విషయాల జోలికి వెళ్లకుండా టేకు చెట్ల మొదళ్లను చూసి మాత్రమే ప్రాథమిక నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. గత నెల 30న ఇందుకూరు రేంజ్ అధికారి దుర్గాకుమార్ బదిలీ అయ్యారు. అంతకు రెండు రోజులు ముందుగానే 69కి పైగా టేకు చెట్లను నరికి



రమణయ్యపేటలో టేకు చెట్టును నరికేయగా మిగిలిన మోడు

తరలించుకుపోవడంలో అటవీ శాఖాధికారుల పాత్ర ఉందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి తోడు సెక్షన్ ఇన్‌చార్జి అధికారి, మరో సెక్షన్ అధికారి టేకు చెట్ల దొంగకు సహకరించారనే అనుమానాలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా టేకు చెట్ల విలువ రూ.60లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం సదరు సెక్షన్ ఆఫీసర్‌తో పాటు రేంజ్ అధికారిపైనా కఠిన చర్యలు ఉండే అవకాశాలుండడంతో విచారణను నీరుగార్చి టేకుచెట్ల విలువను ఐదారు లక్షలు తక్కువగా విచారణ నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. ఈ వ్యవహారమంతా బదిలీపై వెళ్లిపోయిన రేంజ్ అధికారిని రక్షించేందుకేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

వాస్తవానికి టేకు చెట్లు మాయమైన రెండు రోజుల్లోనే దొంగలను పట్టుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ దిశగా విచారణ జరపలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొందూరుకు చెందిన ఒక వ్యక్తి (ప్రస్తుతం సీతానగరం) టేకు చెట్లను అధికారుల అండతో తరలించుకుపోయాడని మండలంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కానీ 60 లక్షల వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరపాల్సి వుంది. అయితే దేవీపట్నం సెక్షన్ అధికారి బాపిరాజును ప్రాథమిక విచారణాధికారిగా నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంటల్లో చిక్కుకుని వృద్ధురాలి మృతి

పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్ కాలనీలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. ఓ వృద్ధురాలు మృతి చెందినట్టు ఏడీఎఫ్‌వో



ఎం.శ్రీహరి జగన్నాథ్ తెలిపారు. రాజీవ్ కాలనీలో కనకాల సత్తిబాబు, అతడి భార్య బూరమ్మ (75) నివాసముంటున్నారు. ఇంట్లో వంట చేసుకునే సమయంలో ఎగసిపడిన నిప్పురవ్వల కారణంగా మంటలు వ్యాపించాయి. సామాన్లు తీసుకుందామని ప్రయత్నం చేసే సమయంలో బూరమ్మ మంటల్లో చిక్కుకుపోయింది. స్థానికులు అతికష్టం మీద బయటకు తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం సంభవించింది.

మహద్భాగ్యం

ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల సందర్శన
టెంపుల్ టూరిజం బస్సును ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్
తొలి యాత్రలో పాల్గొన్న 18 మంది



రాజమహేంద్రవరంలో బస్సు యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆరు పుణ్య క్షేత్రాలను ఒకేరోజు దర్శనం చేసుకునేలా బస్సు ఏర్పాటు చేశారు. శనివారం దానిని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ సమీపంలోని టూరిజం కార్యాలయం వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టూరిజం బోర్డు సభ్యులు గంటా స్వరూపదేవి, వాసిరెడ్డి రాంబాబు, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. 20 మంది యాత్రికులతో బస్సు బయల్దేరింది. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకాన్ని పరుగులు పెట్టించాలన్న ఉద్దేశ్యంతో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఒక రోజు బస్సు యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వరస్వామి, బిక్కవోలు లక్ష్మీగణపతి, కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాల సందర్శన అనంతరం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో గోదావరి హారతి తిలకించేలా ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాద్‌లతో పాటు ఎకో అడ్వెంచర్, వెల్‌నెస్, టెంపుల్ టూరిజంలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. వీటన్నిటినీ కలిపి టూరిజం సర్క్యూట్లుగా చేసి సత్ఫలితాలు సాధించాలని భావిస్తున్నామన్నారు. రుషికొండ బీచ్ బ్లూఫ్లాగ్ బీచ్‌గా సర్టిఫికెట్ పొందిందన్నారు. దానితో పాటు కాకినాడ, సూర్యలంక, రామాపురం, నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లు బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపాంతరం చెందేందుకు కృషి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

అన్నవరం: టెంపుల్ టూరిజంలో భాగంగా 18మంది తొలి ప్రయాణం చేశారు. అన్నవరం సత్యదేవుని సన్నిధికి విచ్చేసిన వారికి పీఆర్వో విభాగ అధికారులు బలువు సత్యశ్రీనివాస్, ఎం.గణపతిరావు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు మాట్లాడుతూ ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాలను దర్శించడం, చివరిగా గోదావరి హారతిలో పాల్గొనడం ప్రత్యేక అనుభూతి కలిగించిందన్నారు.

పిఠాపురం: టెంపుల్ టూరిజంలో భాగంగా 18మంది భక్తులు పాదగయ క్షేత్రానికి వచ్చారు. వారికి ఆలయ ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది వారికి దర్శనాలు చేయించారు. భక్తులకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.



అన్నవరం దేవస్థానంలో...





ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు, దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమే ముఖ్యమా!

దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్
గుమ్మళ్లదొడ్డిలో 5వ రోజుకు నిరవధిక దీక్ష

గోకవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమ నిర్వహణే ప్రభుత్వానికి ముఖ్యమా అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తరలించాలని కోరుతూ తూర్పు గోదావరి జిల్లాగోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకొంది. దీక్షా శిబిరాన్ని హర్షకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు తాను అండగా నిలుస్తానన్నారు. కాలుష్య పరిశ్రమల నిర్వహణ కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వేధిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించి కంపెనీని ఇక్కడి నుంచి తరలి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్యకారకమైన పరిశ్రమను తమ గ్రామం నుంచి తరలించాలని కోరుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చేరే విధంగా స్థానికులు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. పరిశ్రమ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోస్టు కార్డులో పొందుపరుస్తున్నారు. అనారోగ్యానికి గురిచేసే ఈ పరిశ్రమ మాకొద్దంటూ అధిక సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం రహదారిపై బైఠాయించారు. దీంతో అటు రెండు కిలో మీటర్లు, ఇటు రెండు కిలో మీటర్లు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పరిశ్రమ గేటు ఎదుట ఆందోళన చేసేందుకు బయల్దేరిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన విరమించాలని అదనపు ఎస్పీ సుబ్బరాజు మరోమారు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పరిశ్రమను గుమ్మళ్లదొడ్డి నుంచి తరలిస్తామని తమకు సరైన హామీ లభించే వరకు ఆందోళన విరమించేది లేదని ఆందోళనకారులు తేల్చి చెప్పారు.

పోలీసులకు, గ్రామస్తులకు మధ్య తోపులాట
సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

కాగా ఇథనాల్ పరిశ్రమ ప్రధాన గేటు ముందు శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.. పరిశ్రమ నిర్వహణను తక్షణమే నిలిపివేయాలంటూ స్థానికులు గేటు ఎదుట ఆందోళనకు దిగారు. పరిశ్రమ నుంచి బయటకు లోపలకు వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం సమాచారం మేరకు భారీస్థాయిలో పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన నిలిపివేయాలని హెచ్చరించారు. అయినప్పటికీ స్థానికులు ససేమిరా అనడంతో ఆందోళనను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు.. ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది.ఈ ఘటనలో బావాజీపేటకు చెందిన ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు సమాచారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు ఆందోళనకారులను వాహనాలు ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సమసింది. నాలుగు రోజులుగా జరుగుతున్న నిరవధిక దీక్షను భగ్నం చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు, మృతుడు వెంకట రమణ (పాతచిత్రం)



ఆనందం... అంతలోనే విషాదం

- తూర్పు గోనగూడెం సమీపంలో కారును ఢీకొన్న ఐషర్ వ్యాన్... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
- రాజమహేంద్రవరంలో వివాహ వేడుకకు వెళ్తుండగా ప్రమాదం

రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి ఆనందంగా బయల్దేరిన వ్యక్తి అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం తూర్పుగోనగూడెం సమీపంలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తొండంగి మండలం వలసపాకలు అగ్రహారానికి చెందిన నట్టే వెంకటరమణ (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ వర్క్‌ఫ్రం హోమ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం వివాహ వేడుకలో పాల్గొనేందుకు కారులో రాజమహేంద్రవరం పయనమయ్యాడు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సమీపానికి వచ్చేసరికి హైవే డివైడర్‌లో నుంచి దారిమళ్లుతున్న ఐషర్ వ్యాన్ కారును బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా కారు నడుపుతున్న వెంకటరమణ కారులోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న రాజానగరం సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ తెలిపారు. ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

సామర్లకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు చెందిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. అనకాపల్లి, విశాఖపట్నం, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పాడేరు జిల్లాలకు చెందిన ఎంపీ డీవోలు, ఈవోపీఆర్డీలు 120 మంది హాజరయ్యారు. ముఖ్య అతిథి, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శిక్షణ అనంతరం అధికారులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అందజేశారు. ఫ్యాకల్టీలుగా జి.రమణ, కె.శ్రీనివాసరావు, ఆంజనేయులు, ప్రసాద్, నిహారిక వ్యవహరించారు. ఈ నెల 28, 29 తేదీలో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, డాక్టర్ కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అధికారులు హాజరవుతారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చెప్పారు.

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

పట్టుకునేందుకు ప్రయత్నించగా తోసి పరారైన ప్రియుడు
తలకు బలమైన గాయంతో మధుబాబు మృతి...
నిందితులు రిమాండ్‌కు తరలింపు

తొండంగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరంలో సంచలనం రేకెత్తించిన బత్తిన మధుబాబు అనుమానాస్పద మృతి కేసులో అనుమానితులుగా ఉన్న మధు భార్య శిరీష, ఆమె ప్రియుడు పీతల ప్రశాంత్‌కుమార్‌లకు శనివారం తుని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించిందని తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. శిరీష, ప్రశాంత్‌కుమార్ మధ్య ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ నెల 18న మధుబాబు ఇంటికి ప్రశాంత్‌కుమార్ వెళ్లాడు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న మధు గమనించి ఇద్దరినీ పట్టుకునే ప్రయత్నం చేయగా మధును ప్రశాంతకుమార్ తోసివేసి పరారయ్యే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మధుబాబు తలకు బలమైన గాయమై మృతి చెందగా బంధువులు సహజ మరణంగా భావించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 24న శిరీష ఇంటికి ప్రశాంత్‌కుమార్ రాగా వారిద్దరినీ పట్టుకున్న బంధువులు, గ్రామస్తులు మధుబాబు మృతికి వారే కారణమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పంచనామా చేయించామన్నారు. ప్రాథమికంగా మధుబాబు తలకు బలమైన గాయమైనట్టు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా శిరీష, ప్రశాంత్‌కుమార్‌లకు రిమాండ్ విధించినట్టు జగన్మోహన్ చెప్పారు.

ధ్యానంతో మనసుకు ప్రశాంతత

- శ్రీఅరబిందో సొసైటీ ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాస్ ములుగు

రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ కనీసం ఐదు నిమిషాలు దీర్ఘ శ్వాస, ధ్యానం చేయడం ద్వారా మనసుకు ప్రశాంత పొందచ్చని, ఆలోచనలను నియంత్రించవచ్చని శ్రీఅరబిందో సొసైటీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాస్ ములుగు పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ అటానమస్ కళాశాలలో 'అంతర్గత సామరస్యం-సాధన' అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అంతర్గత సామరస్యం, శరీరం, మనస్సు, భావోద్వేగాల స్థిరీకరణ ద్వారా సాధ్యమని విద్యార్థులకు వివరించారు. ఒక వ్యక్తికి సాధారణంగా రోజుకు 65 వేల నుంచి 75 వేలు వరకు ఆలోచనలు వచ్చే అవకాశం ఉందని, అయితే మనసు ఏకాగ్రతతో కేవలం 8 సెకన్ల పాటు మాత్రమే ఒక అంశంపై కేంద్రీకరించగలదని చెప్పారు.

సాధారణ శారీరక వ్యాయామం మనసుకు స్థిరత్వాన్ని అందిస్తుందని, ఆచరణలో ఉన్న మనస్సు నెగిటివ్ ఆలోచనలకు లోనుకాకుండా ఉంటుందన్నారు. భావోద్వేగ నియంత్రణ సమతుల్య జీవితానికి పునాది అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యానం సాధన



వ్యక్తిగత జీవితంలో గొప్ప మార్పు తీసుకొస్తుందన్నారు. మన ఆహారం మనసును ప్రభావితం చేస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ఎంపిక చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిని జీజీయా తరఫున దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్, డైరెక్టర్లు టీవీ ప్రసాద్, ఆర్‌ఎస్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ కేదార్నాథ్ మహాపాత్ర, మైనింగ్ విభాగం అధిపతి వినోద్, విద్యార్థులు, వరంగల్, యానాం, తెనాలి, తిరుపతి, రాజమహేంద్రవం ప్రాంతాల నుంచి అరబిందో సొసైటీ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు వచ్చిన సమాచారం మేరకు మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని తపతొట్టి గ్రామం నుంచి ఖమ్మం జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మయిన్‌గొల్లారి, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా నిమల్‌పాలేనికి చెందిన మయిన్ గొల్లారి, చింతూరు మండలానికి చెందిన కిలో దేబో లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పల్సర్ మోటార్ సైకిలు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.1.10లక్షలు ఉంటుంది. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుల్ ఎన్‌ఆర్‌కే రాజు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడు

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శృంగారవల్లభ స్వామి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,48,350 అన్నదాన విరాళాలు రూ.52,803, కేశఖండన ద్వారా రూ.6,120, తులాభారం ద్వారా రూ.450, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.24,630... మొత్తం రూ.2,32,353 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉచిత బియ్యం బకాయిల జమ

యానాం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి):పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న 3.35లక్షల రేషన్ కార్డులకు ఆగస్టు, సెప్టెంబరునెలలకు ఉచిత బియ్యం బకాయి సొమ్ములను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు సీఎం ఎన్.రంగసామి తెలిపారు.ఎరుపు రంగు కార్డులకు 2నెలలకు రూ.1200, పసుపు రంగు కార్డుకు రూ.600 జమ చేశామన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

కాట్రేనికోన, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సర్పంచ్ అవార్డు పొందిన గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి కృష్ణంరాజును సేవామిత్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ట్రస్టు అధ్యక్షుడు దాకమర్రి నాగమణేశ్వరరావు, జవ్వాది దుర్గాప్రసాద్, వెంట్రు ప్రసాద్, కోటిపల్లి సత్యనారాయణ, చెల్లూరి రాజబాబు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో జోరుగా అనధికార ఇసుక తవ్వకాలు

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో రాత్రి సమయాల్లో అనధికార ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడి తదితర ప్రాంతాల నుంచి ఇసుకను అనధికారికంగా తవ్వి పడవలపై ఆదుర్రు, బాడిలంక తదితర ప్రాంతాల్లో దింపి ట్రాక్టర్ల ద్వారా సొమ్ములు చేసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనధికార ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆదుర్రులో స్థానికులు ఇసుక ట్రాక్టర్లు అడ్డుకుని ఏ విధంగా ఇసుక తవ్వుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అనధికారికంగా ఇసుక తవ్వి ట్రాక్టరు ట్రక్కు రూ.3వేల నుంచి రూ.4వేలకు అమ్ముకుని సొమ్ములు చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై తహశీల్దార్ ఆచార్యులును వివరణ కోరగా ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని, తవ్వకాలపై నిఘా పెట్టాలని వీఆర్వో, వీఆర్ఏకు సూచించినట్టు తెలిపారు.

విద్యార్థుల సేవలు అమూల్యమైనవి

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని హెచ్‌ఎం భావరాజు సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. అప్పనపల్లి హైస్కూలులో 2002-03లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమకూర్చి రూ.30వేలతో చేపట్టే వాష్‌బేసిన్ నిర్మాణాన్ని హెచ్‌ఎం శనివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు మేడేపల్లి సత్యనారాయణ, పడవల మల్లేష్, చింతపల్లి సతీష్, పసుపులేటి నాగమణి, కనకదుర్గ, ప్రసూన పాల్గొన్నారు.

చిన్నకు ఆర్థిక సాయం

అంబాజీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కొర్లపాటివారిపాలేనికి చెందిన పరసా చిన్ననాయుడికి స్థానిక నేతలు గణపతి వీరరాఘవులు, మేడిద చిన్న, మైపాల తాతాజీ, సుదాబత్తుల రవి, కొర్లపాటి కాశీ ఆర్థిక సాయం అందించారు.

లక్ష్యానికి మించి టీడీపీ సభ్యత్వ నమోదు చేయాలి

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పలు చోట్ల సభ్యత్వ నమోదు





అమలాపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, పి.గన్నవరం శివారు డి.ఎస్.పాలెంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, ముమ్మిడివరం: సీహెచ్‌గున్నేపల్లిలో పార్టీ సభ్యత్వాలు చేయిస్తున్న టీడీపీ నాయకులు

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కమిటీ నిర్దేశించిన లక్ష్యాలను మించి సభ్యత్వ నమోదు చేసే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణ, మండలశాఖల అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, మల్లుల పోలయ్య, దెందుకూరి సత్తిబాబురాజు, నాయకులు నల్లా స్వామి, కుసుమే సూర్యమోహనరావు, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, జంగా అబ్బాయివెంకన్న, పరమట శరత్‌బాబు, వంటెద్దు బాబు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న నాయకులు

పి.గన్నవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు కార్యకర్తలు, నాయకులను కోరారు. పి.గన్నవరం శివారు డి.ఎస్. పాలెంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుతో కలిసి పాల్గొని అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం రూ.లక్షతో నామన శాశ్వత సభ్యత్వ తీసుకున్నారు. స్థానిక అక్విడెక్టు వద్దగల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పెదపట్నం గ్రామానికి చెందిన కొమ్ముల వీరవెంకటనాగేశ్వరరావు రూ.లక్షతో శాశ్వత సభ్యత్వ తీసుకున్నారు. అనంతరం నియోజవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్లు రాష్ట్ర సివిల్‌సప్లయి డైరెక్టర్ మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, పలువురు నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంసాని పెద్దిరాజు, నక్కా సునీల్‌రాజు, చొల్లంగి సత్తిబాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, ఆరుమిల్లి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, త్సల్లా బిందుమాధవరావు, పడాల సూపర్, సాధనాల శ్రీనివాస్, పత్తిపాటి వెంకటేశ్వరావు, పెచ్చెట్టి వీరవెంకటసత్య నారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సభ్యత్వం చేయించాలి

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతీ కార్యకర్త విధిగా సభ్యత్వ నమోదు చేయించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మామిడికుదురు పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలశాఖ అధ్యక్షుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదును గ్రామాల్లో అధిక సంఖ్యలో చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఈలి శ్రీనివాస్, బోనం బాబు, వర్ధినేని బాబ్జి, సూదా బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, నయినాల సత్యనారాయణమూర్తి, సాపే కాశి, కంచి విశ్వనాథం, పెచ్చెట్టి భాస్కరరావు, అప్పారి వెంకటేశ్వరరావు, మానేపల్లి రామకృష్ణ, ముఖర్రం హుస్సేన్ పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

అంబాజీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబులు పేర్కొన్నారు. స్థానిక వెంకట్రాజు ఆయిల్‌మిల్లు వద్ద పార్టీ మండల సమావేశం జరిగింది. గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదును అధికంగా చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు చేసుకున్న పార్టీ కార్యకర్తలకు పత్రాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు చిన్నం బాలవిజయరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల సుబ్బారావు, సర్పంచ్ జల్లి బాలరాజు, దొమ్మేటి రామారావు, వక్కలంక బుల్లియ్య, పెదపూడి శ్రీనివాసరావు, మానేపల్లి శ్రీనివాసరావు, నేదునూరి కళ్యాణ్, దువ్వూరి సురేష్, అక్కల సత్తిబాబు పాల్గొన్నారు.

సభ్యత్వాలను త్వరితగతిన పూర్తిచేయాలి

ముమ్మిడివరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వాలను త్వరితగతిన పూర్తిచేసి లక్ష్యాన్ని అధిగమించాలని తెగులుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి దొరబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా దొరబాబు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండినవారు రూ.100సభ్యత్వ నమోదు పొందితే ప్రమాద బీమా రూ.5లక్షలు వర్తిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందిన వారందరికీ పార్టీ పూర్తి అండగా ఉటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో అత్యధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే అభివృద్ధి శరవేగంతో జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి గ్రామానికి వచ్చిన బృందం ట్యాబ్‌లను ద్వారా సభ్యత్వాల నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దాట్ల పృథ్వీరాజ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అర్గాని శ్రీనివాసరావు, బీసీసెల్ అధ్యకుడు దంగేటి శ్రీనివాసరావు, యాళ్ల ఉదయ్, సుంకర శ్రీను, తోట భగవాన్, అయితాబత్తుల మధు, గొలకోటి తాతాజీ, గొలకోటి భాస్కరమూర్తి, శిరంగు సూర్యనారాయణ, యాళ్ల దుర్గ, సోమన కృష్ణ, కరాటం వెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలి

మలికిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి పిలుపునిచ్చారు. గొల్లపాలెంలో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్ అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ప్రతీ కార్యకర్తకు పార్టీలో సభ్యత్వం ఉండేలా చూడాలని, అలాగే ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అడబాల యుగంధర్, బందెల పద్మ, అడబాల రమాదేవి, సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మట్టా అనంతలక్ష్మి, నాగళ్ల బేబి, గుండుబోగుల గంగాభవానీ, యెనుముల నాగు, జంపన సత్యనారాయణరాజు, సూరిబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సభ్యత్వాలు

రాజోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కేతా శ్రీను చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, ఏఎంసీ మాజీచైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, అడబాల చంటి, బోళ్ల వెంకటరమణ, అడబాల విజయ్, పామర్తి రమణ, రావి మురళీ, మోకా పార్వతి, కడలి వెంకటరమణారావు, కాండ్రేగుల కుశులుడు, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మానుకొండ దుర్గాప్రసాద్, గాలిదేవర వెంకన్నబాబు, కడలి నారాయణమూర్తి, మామిడిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో సభ్యత్వ కార్యక్రమం

అంతర్వేది, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గ్రామంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోతురాజు కృష్ణ ఇంటి వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, రుద్రరాజు పద్మరాజులతో కలిసి నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడి సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, కడలి వెంకటరత్నం, వనమాలి మూలాస్వామి, దాసరి వాసు, పిల్లా రాజబాబు, సరాగుల రాజారత్నం, కొల్లు మహాలక్ష్మి, పోతాబత్తుల రాంబాబు, ఆర్ఎంపీ తాడి మోహన్‌బాబు, అయినవిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన ఎంబీబీఎస్ సీట్లు కేటాయించాలి

- గవర్నర్‌ను కోరిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి



గవర్నర్ కైలాష్‌నాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఎంబీబీఎస్ సీట్లు ప్రస్తుత జనభా ప్రాతిపదికన పరిగిణలోకి తీసుకుని సీట్లు కేటాయించాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథ్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో గవర్నర్‌ను మల్లాడి కలిసి వినతిపత్రం అందజేశారు. యానానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై గవర్న ర్‌తో మల్లాడి చర్చించారు. ఎంబీబీఎస్ సీట్లలో యానాం రిజర్వేషన్‌కు సంబంధించి 2001 జనా భా కాకుండా ప్రస్తుతం 2024 జనాభా ప్రాతిప దికన సీట్లు కేటాయించాలన్నారు. ముఖ్యంగా యానాంలో ఓబీసీలోని పలు కులాల వారికి ఎంబీబీఎస్ సీట్లలో న్యాయం జరగటం లేదని, నివేదికల ఆధారంగా గవర్నర్‌కు వివరించామని మల్లాడి తెలిపారు. దీనిపై పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆరోగ్యశాఖ కార్యదర్శిలను గవర్నర్ నివేదిక కోరారని మల్లాడి వివరించారు. గతంలో చర్చించిన యానాం పెండింగ్ అంశాలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గవర్నర్ నోట్ పంపించారని మల్లాడి తెలిపారు. నవంబరు చివరి వారంలో గవర్నర్ యానాం పర్యటనకు రానున్నారని, దీనికి సంబంధించి మరో వారంలో గవర్నర్ కార్యాలయం నుంచి అనుమతి వస్తుందని మల్లాడి వివరించారు.

ఎస్సీ, ఎస్టీలకు దీపావళికి దుస్తులు

యానాం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా దుస్తులు అందించేందుకు రూ.12.76కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. సీఎం రంగసామి, మంత్రి సాయిశరనన్‌లు చెక్కును విడుదలచేశారు. మహిళలకు చీర, మగవారికి దుస్తులు కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమచేశారు. యానాంలో 2,552మంది పురుషులు, 2949మంది మహిళలకు రూ.వెయ్యి చొప్పున రూ.55లక్షలు వారి ఖాతలో ఆదిద్రావిడ శాఖ జమచేసింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోరి పాఠశాల విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అంతర్వేది, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మోరి హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్.శ్రీధర్ తెలిపారు. 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అండర్-14,-17 బాలబాలికల అథ్లెటిక్ పోటీల్లో బాలికలు విభాగంలో 3వేల మీటర్ల స్పీడ్‌వాక్ విభాగంలో ముత్యాల గీత ప్రథమ స్థానం, హైజంప్‌లో దేవిసత్యశ్రీ ద్వితీయస్థానం సాధించారు. హైజంప్‌లో చెల్లుబోయిన భావన ద్వితీయస్థానం, చెల్లుబోయిన భువన జిల్లా తృతీయ స్థానం సాధించారన్నారు. వచ్చే నెల 3, 4 తేదీల్లో అండర్-17 బాలబాలికలకు శ్రీకాకుళం జిల్లా జరిగే, 6, 7 తేదీల్లో అండర్-14 బాలబాలికలకు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్, దివ్యలను సర్పంచ్ లక్ష్మీపద్మమంగతాయారు భగవాన్, అలివేలుగంగాత్రివేణి నాని, జాన శంకరరావు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అభినదించారు.

జ్యూట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

మలికిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జ్యూట్ ఉత్పత్తులపై శిక్షణ పొందిన మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా ఆర్థికాభివృద్ధి పొందాలని నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు అన్నారు. కేశనపల్లిలో శనివారం జ్యూట్ ఉత్పత్తిపై శిక్షణ ప్రారంభించారు. నాబార్డు వారి ఆర్థిక సహకారంతో డీఆర్డీఏ, ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల జీవనోపాధి ఆధారిత శిక్షణా కార్యక్రమాలను కేశనపల్లి, పడమటిపాలెం, గూడపల్లి గ్రామాల్లో నిర్వహించినట్లు సోమునాయుడు చెప్పారు. శిక్షణ పొందిన మహిళలు బ్యాంకుల ఆర్థిక సాయంతో కావాల్సిన పనిముట్లను సమకూర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. డీఆర్డీఏ ఏపీఎం టి.నాగరాజు మాట్లాడుతూ మహిళలకు కావాల్సిన మిషన్ల పంపిణీ కోసం ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. సర్పంచ్ యెనుముల నాగు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కటికిరెడ్డి గంగాధర్, సర్పంచ్‌లు సుందర బ్రహ్మయ్య ఆకుల మాధవీలత, జూట్ బ్యాగ్ ట్రైనర్స్ తోట ఉమామహేశ్వరి, సునీల్, డ్వాక్రా వీవోలు పాల్గొన్నారు.

3న మంగళగిరిలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫణీశ్వరరావు

అమలాపురంటౌన్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): నవంబరు 3న మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర సమావేశం నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బితి ఫణీశ్వరరావు తెలిపారు. టీఎన్‌టీయూసీ సంఘ ప్రతినిధులంతా సమావేశానికి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం కుసుమ సూర్యమోహనరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఫణీశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ శ్రేణులు పాల్గొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వి.ప్రసాద్, పార్లమెంటు అధికార ప్రతినిధి కాశిన జయనాథ్, అసెంబ్లీ అధ్యక్షుడు వలవల శివరావు, ముమ్మిడివరం శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, శ్రీనివాసగౌడ్‌పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

రాజోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ములికిపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో రజకవారి గూపులో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీపీ కేతా శ్రీను శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ కేతా మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగనున్నాయని తెలిపారు. వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, ఎంపీటీసీ సోమిశెట్టి ధనలక్ష్మి, గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు సోమిశెట్టి ప్రకాశరావు, వార్డు మెంబరు శీలం బుజ్జి, వాసురాజు, చుట్టుగుళ్ల రవి, కడలి రామారావు, కాండ్రేగుల సీత, గుబ్బల శ్రీను, శీలం త్రిమూర్తులు, సూర్యనారాయణ, సింహాచలం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం - అంబాజీపేట రోడ్డు పనులు ప్రారంభం



పి.గన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నుంచి అమలాపురం వెళ్లే రహదా రికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పి.గన్నవరం సెంటర్ నుంచి రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈరహదారిలో ప్రయాణం చాలంటే అయ్యా బాబోయ్.. అనుకునే వాహన దారులకు, స్థానికులకు కాస్త ఊరట కలగనుంది. పి.గన్నవరం నుంచి అంబాజీపేట వరకు ఆరు కిలోమీటర్ల మేర రూ.8కోట్ల నిధులతో రోడ్డు పనులు జరగనున్నాయి. అయితే ఐదేళ్లుగా ఈరోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయభ్రాంతులకు గురయ్యే ప్రజలకు ఇక నుంచి ఇబ్బందులు తప్పనున్నాయి. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు సీసీ రోడ్డు 32అడుగులు మేర వెడల్పుతో నిర్మించ నున్నారు. పోతవరం వద్ద రోడ్డు క్రుంగిపోయే ప్రదేశంలో రక్షణగోడ ఏర్పాటుచేసి అనంతరం అంబాజీపేట వరకు బీటీ రోడ్డు వేస్తారు.

మాదిగ కులాల ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నవంబరు 2వ తేదీ శనివారం జరిగే మాదిగ, ఉపకులాల ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సమావేశం కోరింది. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సమావేశం శనివారం మామిడికుదురులోని ఎస్సీ సామాజిక భవనంలో జరిగింది. ఎమ్మెస్పీ జిల్లా అధికారి ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ మాట్లాడుతూ నవంబరు 2న జరిగే మాదిగ కులాల ఆత్మీయ సదస్సుకు మందకృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. గ్రామ, మండల, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. బొంతు సుధాకర్, కండెళ్ల వెంకటేశ్వరరావు, మందా గాంధీ, చాట్ల సత్యనారాయణ, దిగుమర్తి రమేష్, ఆకుమర్తి నాగరాజు పాల్గొన్నారు.

బాలబాలాజీ దర్శనానికి పోటెత్తిన భక్తులు



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తలనీలాలు సమర్పించుకునే భక్తులతో కల్యాణకట్ట కిటకిటలాడింది. శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,06,234 ఆదాయంగా వచ్చిందని ఆలయ ఏసీ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం



షర్మిలతో జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాషిణి

అమలాపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆంధ్రరత్న భవనంలో కాంగ్రెస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. గ్రామస్థాయి నుంచి పార్టీని ఏవిధంగా బలోపేతం చేయాలో పార్టీ శ్రేణులకు ఆమె వివరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, రాష్ట్ర ట్రైనింగ్ ప్రోగ్రాం చైర్మన్ జంగా గౌతమ్, అసెంబ్లీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు గెడ్డం సురేష్‌బాబు, కుడుపూడి శ్రీనివాస్, దామిశెట్టి జయ, యనమదల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తైక్వాండోలో విజేతగా దుర్గాఅభినయ్



దుర్గాఅభినయ్‌ను అభినందిస్తున్న దృశ్యం

అల్లవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎం.దుర్గాఅభినయ్ తైక్వాండో క్రీడలో జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయ స్థాయి ద్వితీయస్థానం సాధించాడు. ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న ఎం.దుర్గాఅభినయ్ తైక్వాండోలో విజేతగా నిలవడం పట్ల బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ మహేశ్వరదత్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకుల ప్రవీణ్, ఏవైఆర్వీ ప్రసాద్, పీడీ దుర్గారావు, కె.సత్యనారాయణ శనివారం అభినందించారు.

యువకుడి అదృశ్యం.. బ్రిడ్జిపై యువకుడి చెప్పులు

యలమంచిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం కత్తి మండ గ్రామానికి చెందిన పెచ్చెట్టి ఏసురాజు కనిపించడం లేదని అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా చించినాడ బ్రిడ్జిపై చెప్పులు, ఫోన్ నంబరు రాసి ఉన్న కాగితం ఉండటాన్ని గమనించిన ఒక వ్యక్తి ఆ ఫోన్ నంబరుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఫోన్ రిసీవ్ చేసుకున్న ఏసురాజు తండ్రి రాము వెంటనే చించినాడ బ్రిడ్జి వద్దకు చేరుకుని చూడగా అక్కడ ఉన్న చెప్పులు తన కుమారు డివని నిర్ధారించుకున్నారు. దీంతో యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసు రాజు గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక ఎక్కడికైనా వెళ్లాడాఅనే అంశాలతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.1.08 లక్షల విరాళం

అంబాజీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో ఉన్న శ్రీభూ సమేత వెంకటేశ్వరస్వామికి పుల్లేటికుర్రుకు చెందిన దంగేటి సూర్యనారాయణ కుమారుడు చంద్రశేఖర్, ఉమలత దంపతులు రూ.1.08 లక్షలు విరాళంగా అందించారు.

ఉచిత బియ్యం బకాయిల జమ

యానాం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి):పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న 3.35లక్షల రేషన్ కార్డులకు ఆగస్టు, సెప్టెంబరునెలలకు ఉచిత బియ్యం బకాయి సొమ్ములను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు సీఎం ఎన్.రంగసామి తెలిపారు.ఎరుపు రంగు కార్డులకు 2నెలలకు రూ.1200, పసుపు రంగు కార్డుకు రూ.600 జమ చేశామన్నారు.

ద్రాక్షారామ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

ద్రాక్షారామ, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. తోటపేట సూర్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పోలీసుల పనితీరు, శాంతిభద్రతల నిర్వహణలో పాత్ర, పోలీసులు వినియోగించే వెపన్స్, వైర్‌లెస్ సెట్ వినియోగంపై ఎస్ఐ ఎం.లక్ష్మణ్ అవగాహన కల్పించారు.

మూడేళ్లుగా 'చెత్త' వ్యాన్లు మూలన

- వినియోగంలోకి రాని చెత్త సేకరణ వ్యాన్లు
- నిర్వహణ భారంతో వినియోగించని పంచాయతీలు
- రూ.లక్షల సొమ్ములు వృథా


చోడవరంలో వినియోగంలో లేని వ్యాన్

ద్రాక్షారామ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్త సేకరణకు గత ప్రభుత్వం పంచాయతీలకు క్లీన్‌ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరిట వ్యాన్లు అందజేసింది. 2021లో మండలంలో ఎంపిక చేసిన పంచాయతీలకు విజయవాడలో ఈ వ్యాన్లు అందజేశారు. అయితే అందులో 90 శాతం వ్యాన్లు వినియోగంలోకి రాలేదు.. కాదు తేలేదు. దీంతో లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేసి ప్రభుత్వం అందచేసిన వ్యాన్లు మూడేళ్లగా మూలనపడ్డాయి. రామచంద్రపురం మండలంలో వెల్ల, ద్రాక్షారామ, వెలంపాలెం, యేరుపల్లి, ఉట్రుమిల్లి, కాపవరం, కందులపాలెం, నరసాపురపుపేట, తోటపేట, చోడవరం, గ్రామాలకు వ్యాన్లు అందచేశారు. అందులో ద్రాక్షారామ, వెల్ల, తోటపేట, వెలంపాలెం పంచాయతీలు మాత్రమే వ్యాన్లు వినియోగిస్తున్నాయి. చోడవరం,కందులపాలెం, కాపవరం, ఉట్రుమిల్లి, నరసాపురపుపేట, యేరుపల్లి పంచాయతీలు వ్యాను అసలు వినియోగించలేదు. దీంతో ఇవి మూలనపడ్డాయి. వెల్ల పంచాయతీలో రిపేరు రావడంతో ప్రస్తుతం వాడటం లేదు. వేగాయమ్మపేటలో కొద్ది రోజులు మాత్ర వినియోగించి రిపేరు రావడంతో పక్కన పెట్టారు.

నిర్వహణ భారంతోనే :

వ్యాన్లను పంచాయతీలు వాడకపోవడానికి వ్యాన్లు నిర్వహణ భారం కావడమే అంటు న్నారు. డ్రైవర్లకు వేతనం, డీజిల్‌తో పాటు ఇతర రిపేరు చార్జీలు భారం పంచాయతీలు భరించే స్థాయిలో లేకపోవడంతో వినియోగంలోకి తేవడం లేదని చెబుతున్నారు. అసలు పంచాయతీలకు నిధులు లేకపోవడంతో వ్యాన్ల నిర్వహణ భారంగా మారిందని వినియోగిస్తున్న పంచాయతీ సర్పంచ్‌లు అంటున్నారు. వ్యాన్లు నిర్వహణకు నిధులు సమకూర్చితే వినియోగంలోకి తేవచ్చని చెబుతున్నారు.

కుక్కల బెడదను నివారించాలని సభ్యుల డిమాండ్

- ఆలమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం


మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆలమూరు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, వీటిని నివారించకపోతే రానున్న రోజుల్లో మరింత ప్రమాదం పొంచి ఉన్నట్లేనని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం జరిగింది. గ్రామాల్లో కుక్కల నివారణకు ఆంక్షలు ఉండటంతో, వాటి సంఖ్య గణనీయంగా పెరిగిపోయి దాడులకు దిగుతున్నాయని, ముఖ్యంగా చొప్పెల్ల, పెదపళ్ల, పీహెచ్‌సీలు, ఆలమూరు సీహెచ్‌సీలోను కుక్కల దాడిలో గాయపడిన వారి కేసులు అధికంగా నమోదు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని, అందువల్ల వీటి నివారణపై ఏదో ఒకటి చేపట్టకపోతే ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నట్లు సర్పంచ్ సంగిత సుభాష్, గుణ్ణం రాంబాబు, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం కుక్కల నివారించడం వీలు కాదని, అయితే కుటుంబ నియంత్రణ ద్వారా సంఖ్యను తగ్గించే చర్యలు చేపట్టే పరిస్థితి ఉందని ఎంపీడీవో జాన్‌లంకన్, ఈవోపీఆర్డీ ఎ.రాజు వివరించారు. మండలంలో ఇటీవల ఏర్పాటుచేసిన మద్యం షాపుల వల్ల ఎటువంటి ఇబ్బంది లేదని, అయితే గ్రామానికి రెండు చోట్ల బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం వల్ల మద్యం పారుతుందని సభ్యులు ఆరోపించారు. బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు వివరించారు. జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీవో జాన్‌లింకన్, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఈవోపీఆర్డీ ఎ.రాజు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కోటిపల్లి ఫెర్రీని పరిశీలించిన అధికారులు


కోటిపల్లి రేవులో పరిశీలన చేస్తున్న అధికారుల బృందం

కె.గంగవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి - ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో రాకపోకలు నిలిచిపోయి మూడు నెలలు కావస్తుంది. జూలై నెలలో వరదల కారణంగా ప్రభుత్వం రాకపోకలు నిలిపివేసింది. తదుపరి వరదలు తగ్గినా ఫెర్రీ రేవు మధ్యలో ఉన్న తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడం, రేవు నిర్వహణ పాట నిర్వహించకపోవడం వంటి కారణాలతో రేవులో రాకపోకలు పునరుద్ధరించలేదు. ఈరేవులో రాకపోకలు నిలిచిపోవడంతో యాత్రికులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయంపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అప్పటి నుంచి రేవు నిర్వహణకు పాట పెట్టాలా లేకపోతే ప్రభుత్వమే నిర్వహించాలా అనే చర్చలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో శనివారం ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, హెడ్‌వర్క్ ఏఈ ముజీబ్, గ్రామ కార్యదర్శి ఎస్.సుబ్బారావు, అధికారులు రేవును పరిశీలించారు. ఫెర్రీలో ఎక్కడ నుంచి ఎక్కడ వరకూ పంటును తిప్పాలనే దానిపైన రూట్ మ్యాప్ తయారు చేయాల్సి ఉండటంతో హెడ్‌వర్క్స్ ఏఈ ఈపరిశీలనలో పాల్గొన్నారు. ఫెర్రీ రేవులో, గోదావరి మధ్యలో ఉన్న తాత్కాలిక రహదారిని పరిశీలించారు. నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని, తొందరలోనే రేవు నిర్వహణ చేపడతామని ఎంపీడీవో శ్రీనివాస్ చెప్పారు. రాబోయేది శ్రావణమాసం కావడంతో అటు ముక్తేశ్వరం, అయినవిల్లి, అప్పనపల్లి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు రేవులో రాకపోకలు ఎప్పుడు పునరుద్ధరిస్తారాని ఎదురుచూస్తున్నారు.

భక్తుల రద్దీ

వేంకన్న ఒక్క రోజు ఆదాయం రూ.37.66లక్షలు



ఆత్రేయపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తలనీలాలు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.37.66 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్, ఈవో భూపతిరాజు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వరి కోతలు ప్రారంభం

- యంత్రాల ద్వారా కోతలు జరుపుతున్న రైతులు


పసలపూడిలో యంత్రాలతో కోతలు జరుపుతున్న దృశ్యం

రాయవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రాయవరం మండలంలోని పంట కోతకు రావడంతో రైతులు వరి కోతలు మొదలు పెట్టారు. మండలంలోని 12 గ్రామాల్లో 14,515 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసి సాగు జరిపారు. బోర్లు ద్వారా నారుమళ్లు వేసి ముందుగా సాగు చేపట్టిన రైతులు పంట కోతకు రావడంతో పసలపూడి, చెల్లూరు, వి.సావరం గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించారు. వీరితో పాటు విత్తనాలు ధాన్యం సాగు చేపట్టిన రైతులు కోతలు జరుపుతున్నారు. ఈనెల 31న దీపావళి అమావాస్య ఉండటంతో రైతులు దీపావళి తరువాత పూర్తిస్థాయిలో కోతలు మొదలు పెట్టనున్నారు. మరో మూడు రోజుల్లో ఏపీలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచించడంతో రైతన్నల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో పంటలు దిగుబడులు ఏవిధంగా ఉంటాయనే అనుమానం రైతుల్లో ఉంది. నెల రోజుల పాటు పూర్తిస్థాయిలో వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్ సీజన్ నుంచి మండలంలోని రైతులు మాసూళ్ల పూర్తి చేసే అవకాశం ఉంది. మరో 15రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాల్లో పూర్తిస్థాయిలో వరి కోతలు జరుగతాయని మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. రైతులకు వరి కోతలు జరిపేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో వరి కోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

సోమగుండం చెరువు పాట రూ. 6,18,999కు ఖరారు

కె.గంగవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయానికి చెందిన సోమగుడం చెరువులో చేపల పెంపకానికి శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాది కాలానికి నిర్వహించిన పాటను చెల్లూరుకు చెందిన జొన్న వీరబాబు రూ.6,18,999 హెచ్చు పాటపాడి ఖరారు చేసుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ తనిఖీ అధికారి బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో భీమశంకరం, గ్రామ ప్రముఖులు గొడవర్తి రామకృష్ణ, పెమ్మాడి సత్తిబాబు, పిల్లి శ్రీనివాసు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఆత్రేయపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 16వ విడత ఉపాధి సామాజిక ప్రజాతనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎస్ఆర్‌పీ కనకారావు ఆధ్వర్యంలో బృందం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈనెల 14నుంచి 25వరకు ఈబృందం 17గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రజావేదికలో 716పనులకు 9,17,85000 ఖర్చుపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం వాడపల్లిలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులు, కట్టుంగ గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్, ఏపీడీ మల్లికార్జునరావు, ఎంపీడీవో బీకే ఎస్ఎస్ వెంకటరామన్, హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనుల తనిఖీ

కె.గంగవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భూమి పూజలు చేసిన పనులు పురోగతిని క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. శనివారం పామర్రులో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రూ.6.5లక్షలతో నిర్మి స్తున్న సీసీ రోడ్డు పనులను జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎం.బాలాజీ సిబ్బం దితో పరిశీలిచారు. రోడ్డు పనులు నాణ్యతను తనిఖీ చేశారు. ఎన్ఆర్‌జీఎస్ ఏఈ సాగర్, మండల ఇంజనీరింగ్ అధికారి ఏసురత్నం, టీడీపీ సీనియర్ నాయకుడు మరివాడ సూరిబాబు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



రాయవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలు, బాణసంచా అమ్మకందారులు నిబంధనలు పాటించాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రామచంద్రపురం అగ్నిమాపక అధికారి ఎ.రామారావు సూచించారు. శనివారం రాయవరంలో బాణసంచా తయారీ, అమ్మకందారులకు నిర్వహించిన సమావేశంలో సీఐ, ఫైర్ ఆఫీసర్ మాట్లాడారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారీచేసినా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. బాణసంచా దుకాణదారులు సూచించిన ప్రదేశంలో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా నిల్వలు ఉంచరాదని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయవరం ఎస్ఐ పి.బుజ్జిబాబు, పోలీస్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

స్త్రీశక్తి భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల


మండపేటలో స్త్రీశక్తి భవనాన్ని ప్రారంభిస్తున్న అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని అమలాపురం ఎంపీ జీవీ హర్ష కుమార్ అన్నారు. పట్టణంలో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగిన మెప్మా భవనం ప్రారంభోత్సవానికి అమలాపురం ఎంపీతోపాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మెప్మా ఎండీ భరత్‌తేజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ గొల్లపుంత కాలనీలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన స్త్రీశక్తి మహిళా భవనాన్ని గత ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. దీంతో చాలాకాలం ప్రారంభోత్సవానికి నోచుకోకుండా ఉండిపోయిందని దాని వల్ల మహిళా సంఘాలకు నష్టం కలిగిందన్నారు. మళ్లీ చాలా కాలం తర్వాత ఈ భవనం ప్రారంభానికి నోచుకుందన్నారు. మెప్మా మిషన్ ఎండీ భరత్‌భూషణ్ మాట్లాడుతూ గతంలో మెప్మా ద్వారా మహిళా సంఘాలకు స్కిల్ డెవ లప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.500 కోట్లను కేటాయించగా వాటిని వినియో గించుకోకపోవటం వల్ల నిధులు వెనక్కి మళ్లి పోయాయని అన్నారు. చైర్‌పర్సన్ రాణి మాట్లాడుతూ గొల్లపుంతకాలనీ వాసులకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మున్సి పల్ కమిషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ పట్టణంలో తడి, పొడి చెత్తను సేకరించడంలో మెప్మా ఆర్‌పీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, డీఈఈ శ్రీనివాస్, మెప్మా పీడీ ప్రియంవద, సుజాత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్లిన అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

బదిలీ అధికారులకు సత్కారం

ఆలమూరు, అక్టోబరు 26: మండలంలో పనిచేసి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన అధికారులను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. పనిచేసిన కాలంలో అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో జాన్‌లింకన్ అన్నారు. ఆలమూరు మండల ఈవోపీఆర్డీగా పనిచేసి బదిలీపై వెళ్లిన పీఆర్‌సీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసి బదిలీ అయిన కె.సంజీవ్‌రెడ్డి, ఆర్‌వీవీ సత్యనారాయణ, యు.రేణుక, ఎం.శ్యామ్‌సుందర్, పి.రాజు, సుప్రియలను సత్కరించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీవో జాన్‌లింకన్, ఈవోపీఆర్డీ ఎ.రాజు, మండల పరిషత్ ఏవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు విజయ్‌రెడ్డి, వేణు, వీరమాత తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కపిలేశ్వరపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో గౌతమీ గోదావరి నదీ తీరాన ఓడలరేవు వద్ద కొలువైయున్న శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియుల సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లాడి వీరబ్రహ్మం, తెలుకోటి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి బలం

సభ్యత్వ నమోదులో అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాజకీయపార్టీలో లేని గుర్తింపు టీడీపీలో ప్రతి కార్యకర్తకు ఉంటుందని అమలా పురం ఎంపీ హరీష్‌మాధుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. టీడీపీ సభ్యత్వా ల నమోదులో కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని ఆయ న పిలుపునిచ్చారు. సభ్యత్వాల నమోదులో నియోజకవర్గాన్ని నెంబర్‌వన్ స్థానంలో నిలుపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సి పల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాం బాబు, కె.రామారావు, కె.శ్రీనివాస్, వాదా ప్రసాదరావు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వాల నమోదులో పాల్గొన్న అమలాపురం ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ల

శనేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మందపల్లి మందేశ్వర(శనేశ్వర) స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వ దర్శనాల అనంతరం తైలాభిషేకాల కోసం బారులుతీరారు. స్వామివారిని స్టేట్ యూత్ సర్వీస్ కమిషనర్ కె.శారదాదేవి (ఐఏఎస్) కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. శాశ్వత అన్నప్రసాద విరాళాలను పలువురు భక్తులు అందజేశారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.2,12,896 ఒకరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


శనేశ్వరాలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు


గ్రామసభలో మాట్లాడుతున్న లోవరాజు

మాచర, వల్లూరులో ఉపాధి గ్రామసభలు

కపిలేశ్వరపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాచర, వల్లూరు పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు వాసంశెట్టి సునీత, దాసి మీనాకుమారి అధ్యక్షతన శనివారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో 2025-26 ఏడాదికి సంబంధించి చేపట్టనున్న పనులను గుర్తించి సభలో వినిపించారు. మాచరలో చేపట్టనున్న పంటకాలువలు, చెరువులు, పూడికతీత, ఉద్యానవన పంటలు, మొక్కల పెంపకం తదితర వాటికి సంబంధించి 65 పనులను గుర్తించినట్లు టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు తెలిపారు. కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ అడపా వేణుబాబ్జీ, నాయకులు గుడాల జయబాబు, బడుగు నల్లబాబు, తదితరులతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు చినబాబు, సత్తిబాబు, టీఏ లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు శివకృష్ణ, రాణిఛాందిని, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి


రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ గ్రామసభను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ చిన్నారావు అన్నారు. శనివారం వెదురుమూడిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో జరిగిన అనేక సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోణం నానిబాబు, ఉపసర్పంచ్ చుండ్రు అచ్యుత రామయ్య, కార్యదర్శి శారద, గ్రామ సర్వేయర్లు మణికంఠ, సత్యనారాయణ, శేఖర్, బాలవంశీకృష్ణ, టి.సుశీలదేవి, ప్రియాంక, మల్లిక, సుజాత, వీఆర్‌వోలు ప్రసాద్, సత్యనారాయణ, రామకృష్ణ, సత్తిబాబు, నాగరాజు, పలువురు రైతులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో దీక్ష విరమించిన ఎమ్మెల్యే

మండపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు (వాసు) శనివారం అర్ధమాలను స్వామివారికి సమర్పించి దీక్ష విరమించారు. ఆలయ ట్రస్టీ ఎస్ఎల్ కనకరాజు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామివారికి ఆయన పూజలు చేసి అర్ధమండల దీక్షను విరమించారు. ఆలయ ప్రాంగణంలో వున్న దేవతామూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. రాజమండ్రి ఎమ్మెల్యే వాసుకు వెలమ సంఘ నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు స్వాగతం పలికారు. ఆలయ ట్రస్టీ ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి అయ్యప్పస్వామి ఆలయాన్ని పర్యాటకశాఖలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ, జనసేన నాయకులు, సుంకర వెంకటరమణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుంకర నాని, పళ్ల బాబు, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, జనసేన నాయకుడు చింతాదొరబాబు, వెలమ సంఘ నాయకులు వర్రె వీరబాబు తదితరులు వున్నారు. తొలిసారిగా ద్వారపూడి వచ్చిన వాసును వెలమ సంఘీయులు, టీడీపీ, జనసేన నాయకులు సత్కరించారు.


ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో రాజమండ్రి ఎమ్మెల్యే వాసును సత్కరిస్తున్న దృశ్యం

బాణసంచా తయారీ, అమ్మకందారులు నిబంధనలు పాటించాలి


డీఎస్పీ గోవిందరావు

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, అమ్మకందారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు తెలిపారు. కొత్తపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎనిమిది హోల్‌సేల్ దుకాణాలు, ఐదు తయారీ కేంద్రాలు ఉన్నాయని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వచేస్తే నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల త్రిసభ్య కమిటీ సూచించిన చోట మాత్రమే రిటైల్ బాణసంచా దుకాణాలను తెరిచి అమ్ముకోవాలని కోరారు



వాడపాలెంలో టీడీపీ సభ్యత్వాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

సభ్యత్వ నమోదు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కార్యకర్తల కుటుంబానికి ఎంతో భరోసాగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. నియోజకవర్గానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ఆయన స్వగ్రామం వాడపాలెంలో శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బులితాత, ధర్నాల రామకృష్ణ, బూసి భాస్కరరావు, బండారు వీరబాబు, చీకట్ల అబ్బు, పప్పుల బుజ్జి, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగణన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన ప్రారంభాన్ని పురస్కరించుకుని శనివారం పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి వాడపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. పశుగణన కార్యక్రమం వచ్చే ఫిబ్రవరి 28 వరకు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పశువుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. కొత్తపేట ఏరియా పశువైద్యులు డాక్టర్ ఎస్.రేవంత్‌కుమార్, డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణలు కొత్తపేటలో నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శుభశ్రీ, బీర రమేష్ తదితరులు పాల్గొన్నారు.